క్లుప్తంగా

చిన్నారులకు టీకాలు

తిరువూరు: వ్యాధి నిరోధక టీకాలు వేయడం వల్ల చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తిరువూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రేష్మాబేగం అన్నారు. పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు శనివారం రోగ నిరోధక టీకాలు వేశారు. కంఠసర్పి, న్యుమోనియా, హెపటైటిస్, ధనుర్వాతం, మెదడువాపు, పోలియో వంటి వ్యాధులు రాకుండా రోగ నిరోధక టీకాలు అడ్డుకుంటాయని, ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్నందున ఎక్కడైనా ఈ టీకాలు వేయించుకోవచ్చని సూచించారు. సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



ఇబ్రహీంపట్నం: స్థానిక వైఎస్సార్ కాలనీ, భీమరాజుగుట్ట, జూపూడి గ్రామాల్లో 100 మంది వరద బాధితలకు పీవీకే ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పచ్చిగోళ్ల వెంకట రత్నంరాజ్ (పండు) బియ్యం, నిత్యావసరాలు, ఆర్థిక సహాయం శనివారం అందజేశారు. కార్యక్రమంలో బత్తుల రాజేష్, పోతనపల్లి ప్రదీప్, గోపీ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

బతుకమ్మకు పూజలు



ఊటుకూరు(గంపలగూడెం): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఊటుకూరులో శనివారం మహిళలు బతుకమ్మకు పూజలు చేశారు. తొలుత బతుకమ్మ, వెంపలిచెట్టును నెలకొల్పారు. చుట్టూ చేరి మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ కోలాహలంగా బతుకమ్మకు పూజలు చేశారు.

స్వర్గపురికి రూ.లక్ష విరాళం



తిరువూరు: స్థానిక మునుకుళ్ల రోడ్డులోని స్వర్గపురి హిందూ శ్మశాన వాటికకు డాక్టర్ తాళ్లూరి రామకోటేశ్వరరావు రూ.లక్ష విరాళం అందజేశారు. శనివారం ఈ విరాళాన్ని పూర్వ విద్యార్థుల సంఘం (తోసా) సభ్యులు కలకొండ రవికుమార్, కందుల రవికుమార్, కంభం శ్రీనివాస్‌లకు ఆయన అందజేశారు. శ్మశాన వాటికకు అంతిమయాత్ర వాహనం కొనుగోలుకు ఈ నిధులు వెచ్చిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

ఇబ్రహీంపట్నం: స్థానిక ప్రసాద్‌నగర్‌కు చెందిన నల్లమోతు ప్రసాద్‌రావు ఇటీవల గుండె పోటుకు గురై చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ టీడీపీ కొండపల్లి పట్టణ అధ్యక్షుడు చుట్టుకుదురు శ్రీనివాసరావుకు ఫోన్ చేసి రూ.10 వేలు పంపించారు. ఎమ్మెల్యే తరఫున బాధితుడు ప్రసాదరావుకు శనివారం నగదు అందజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత



జి.కొండూరు: ప్రజల నుంచి సేకరించి అక్రమంగా తరలించేందుకు వ్యానులో లోడు చేస్తున్న రేషన్ బియ్యాన్ని జి.కొండూరు పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. చెవుటూరు గ్రామ శివారులో మినీ వ్యానులో తీసుకొచ్చిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో డీసీఎం వాహనంలో లోడు చేస్తుండగా సమాచారం అందుకున్న ఎస్ఐ సతీష్‌కుమార్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. రేషన్ బియ్యంతో ఉన్న డీసీఎం వాహనం, మినీ ట్రక్కు వ్యానును స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. వాహనంలో సుమారుగా 4 టన్నుల వరకు రేషన్ బియ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని పీడీఎస్ డీటీ పరిశీలించి రిపోర్టు ఇచ్చిన తర్వాత కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

చైన్ స్నాచర్లపై అప్రమత్తంగా ఉండాలి

మైలవరం: మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం మండలాల పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి నడిచి వెళుతున్న మహిళల మెడలో బంగారు గొలుసులు లాక్కుపోతున్నారని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారం తెలిస్తే మైలవరం ఎస్ఐ సెల్: 94407 96447, మైలవరం సీఐ సెల్: 83329 83805 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆక్రమణల చెర



గంపలగూడెం-తోటమూల ఆర్‌అండ్‌బీ రహదారిని ఆక్రమించి తారురోడ్డు వరకు ఏర్పాటు చేసిన ర్యాంప్‌లు

- కుంచించుకుపోతున్న ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి
- ట్రాఫిక్ జామ్‌తో ప్రజల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

గంపలగూడెం: తిరువూరు-మధిర ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి గంపలగూడెం, తోటమూల పరిధిలో ఆక్రమణల కారణంగా కుంచించుకుపోతోంది. ముఖ్యంగా గంపలగూడెం షిర్డీ సాయిబాబా ధ్యాన నిలయం నుంచి తోటమూలలో గోసవీడు క్రాస్ రోడ్డు వరకు రెండు కిలోమీటర్ల రహదారిలో ఆక్రమణలు పెరుగుతున్నాయి. పెద్ద వాహనాలు ఎదురైనప్పుడు ట్రాఫిక్ జామ్ అవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి తిరువూరు, మధిర, విజయవాడ, కంచికచర్ల గ్రామాలకు వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి కూడా కావడంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి.

గంపలగూడెం పరిధిలో గతంలో ఎంతో ఇరుకుగా ఉన్న సింగిల్ రోడ్డును ఏడేళ్ల కిందట 33 అడుగుల మేర విస్తరించి సిమెంట్ డబుల్ రోడ్డు నిర్మించారు. రహదారికి ఇరువైపులా 1.5 గజాలకు పైగా మార్జిన్‌ను వదిలారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విస్తరించిన 33 అడుగుల రహదారి కాస్తా ప్రస్తుతం 23 అడుగులకు తగ్గిపోయింది. రహదారి వెంట గృహస్తులు, వ్యాపారులు తమ ఇళ్ల ముందు ఇంటి నుంచి సీసీ రోడ్డు వరకు ర్యాంప్‌లను, అరుగులను, మెట్లను ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు అయితే సిమెంట్‌రోడ్డును సైతం అడుగుకు పైగా ఆక్రమించి ర్యాంప్‌లు నిర్మించారు.



రామ్మోహన్ సెంటర్‌లో తారురోడ్డు వరకు ర్యాంప్‌లు, ప్రకటన బోర్డుల ఏర్పాటు

ఆక్రమించిన స్థలంలో ఏటీఎం

తోటమూల రింగ్ సెంటర్ సమీపంలో ఇంటి ముందు స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తి ఏకంగా ఒక ప్రైవేటు సంస్థకు చెందిన ఏటీఎం ఏర్పాటుకు అద్దెకు ఇచ్చారు. ప్రధాన రహదారి వెంట రెండు గ్రామాల్లో నూతనంగా ఇళ్లు నిర్మించే వారు నిబంధనల ప్రకారం కొన్ని అడుగుల దూరం వెనుకకు వెళ్లాల్సి ఉంది. కొత్త ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇస్తున్న గ్రామ పంచాయతీ అధికారులు సంబంధిత కట్టుబడి ఏవిధంగా చేస్తున్నారనే విషయమై పర్యవేక్షణ కొరవడటంతో ఎవరి ఇష్టానుసారంగా వారు భవనాలు, దుకాణాలు నిర్మించుకుంటున్నారు.

ఆక్రమించి.. అద్దెలకు ఇచ్చి..

పార్థసారథి హోటల్ సెంటర్ నుంచి తోటమూలలో గోసవీడు క్రాస్ రోడ్డు వరకు 80 నుంచి 100 అడుగుల వెడల్పున ఆర్‌అండ్‌బీ స్థలం ఉంది. పలుచోట్ల ఈ రహదారిని సైతం రెండు వైపులా ఆక్రమించుకొంటున్నారు. దుకాణాలు, ఇళ్ల యజమానులు తమ ఇంటి నుంచి తారురోడ్డు వరకు 15 నుంచి 20 అడుగుల మేర ఆక్రమించుకుని ఆ స్థలాన్ని కూడా అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో విశాలంగా ఉన్న రహదారి తగ్గిపోయి ప్రమాదాలకు దారితీస్తుంది. పెదరాశికుంట వద్ద రహదారికి ఇరువైపులా తారురోడ్డు వరకు ఆర్‌అండ్‌బీ స్థలం ఆక్రమించి కొందరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. తాత్కాలికంగా షెడ్డులే కాకుండా, శాశ్వతంగా గదులను కూడా నిర్మించుకున్నారు. ఇక్కడ రహదారి 7.3 మీటర్ల తారురోడ్డు మాత్రమే మిగిలింది.

డ్రెయినేజీ లేక ఇక్కట్లు

గంపలగూడెం షిర్డీ సాయిబాబా ధ్యాన నిలయం నుంచి గోసవీడు క్రాస్ రోడ్డు వరకు డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో చినుకు పడితే రోడ్డుపైనే నీరు పారుతోంది. కొందరి ఇళ్లల్లోని మురుగునీరు రహదారిపై పారుతుండటంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. రహదారి వెంట కనీసం కచ్చా డ్రెయినేజీ కూడా లేకుండా గృహస్తులు మార్జిన్‌ను ఆక్రమించుకుని మెట్లు, ర్యాంప్‌లు, అరుగులను నిర్మించుకున్నారు. తోటమూలలో కొంత మేర డ్రెయినేజీ నిర్మాణం జరిగినప్పటికీ ఆక్రమణల కారణంగా మూసుకుపోయాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆక్రమణలు తొలగించి పక్కా డ్రెయినేజీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వే చేసి తొలగిస్తాం

జంట గ్రామాలైన గంపలగూడెం, తోటమూలలో ప్రధాన రహదారిగా ఉన్న ఆర్ అండ్‌బీ రోడ్డు ఆక్రమణలకు గురైన మాట వాస్తవమే. రెవెన్యూ, పోలీస్ శాఖల సహకారంతో సర్వే చేసి మార్కింగ్ ఇస్తాం. ఆర్‌అండ్‌బీ స్థలంలో ఆక్రమణలు తొలగిస్తాం. ప్రజలు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలి.

– అచ్చారావు, ఆర్‌అండ్‌బీ ఏఈ గంపలగూడెం

జాతీయ సైన్స్ ప్రాజెక్ట్ అవార్డుల ప్రదానం



అవార్డులు అందజేస్తున్న కరస్పాండెంట్ గౌరీ అమర్నాథ్

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): జీవీఎస్ అవిష్కార్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ ప్రాజెక్ట్ అవార్డుల పంపిణీ కార్యక్రమం కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగింది. జూలై, ఆగస్టు నెలల్లో జాతీయ స్థాయిలో నిర్వహించిన సైన్స్ ప్రాజెక్ట్ కాంపిటేషన్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల కరస్పాండెంట్ గౌరీ అమర్నాథ్ పాల్గొని విజేతలకు నగదు, కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానం ఆరుష్‌నాగ్ (భోపాల్), ద్వితీయ లక్ష్య రాక్‌సింగ్ ఠాకూర్, తృతీయ సంజన (భోపాల్)ను అభినందించారు. వీరికి వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేల విలువైన చెక్కులతో పాటు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పది కన్సొలేషన్ బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం

తిరువూరు: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించారు. కళాశాల చైర్మన్ కిలారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్రను వివరించారు. అంతర్జాతీయంగా ఉపాధ్యాయులకు ఉన్న ప్రాధాన్యతను ఈ దినోత్సవం గుర్తించిందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషిని వివరించారు. కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, ఏఓ కిశోర్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

తిరువూరు: నాగార్జున స్కూల్‌లో ఉపాధ్యాయులను కరస్పాండెంట్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ నరసింహారావు, విద్యార్థులు శాలువాలతో సత్కరించారు. విద్యార్థి స్టడీ సెంటర్‌లో ఉపాధ్యాయులను జన విజ్ఞాన వేదిక, ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సన్మానించారు.

పారిశుద్ధ్యంపై టెక్నికల్ టీం సర్వే



పారిశుద్ధ్యం నిర్వహణపై సమీక్షిస్తున్న స్టేట్ టెక్నికల్ టీం, అధికారులు

మూలపాడు(ఇబ్రహీంపట్నం): వరద ప్రవాహంతో అస్తవ్యస్తంగా మారిన గ్రామీణ ప్రాంతాలపై స్టేట్ టెక్నికల్ టీం దృష్టి సారించింది. టెక్నికల్ టీం ప్రతినిధి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో మూలపాడు 1, 2 గ్రామ సచివాలయాల పరిధిలో ఇంటింటి సర్వే శనివారం నిర్వహించారు. మురుగునీటి నిల్వలు, దోమల పెరుగుదల, మలేరియా, డెంగీ, విష జ్వరాలపై క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. పారిశుద్ధ్యం, స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై ప్రజల అభిప్రాయాలు సేకరించారు. అనంతరం సచివాలయంలో మెరుగైన పారిశుద్ధ్యం, జ్వరాల నివారణపై సమీక్ష నిర్వహించారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వి.మోతిబాబు, సబ్ యూనిట్ అధికారి అప్పారావు, సర్పంచి చింతల భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ

మునుసూరు: ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహిస్తామని ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ఉప సర్పంచ్‌లు, గ్రామానికి ఇద్దరేసి చొప్పున వార్డు సభ్యులకు రెండు రోజులు శిక్షణా తరగతులు జరుగుతాయని చెప్పారు.

దబ్బిగొడ్లకు విశిష్ట పురస్కారం



చాట్రాయి: చనుబండ ఉషోదయ హైస్కూల్ కరస్పాండెంట్ దబ్బిగొడ్ల వెంకటరామయ్య, ప్రిన్సిపాల్ దివ్యవాణి జిల్లా విశిష్ట విద్యా సేవా పురస్కారం అందుకున్నారు. శనివారం జగ్గయ్యపేటలో నిర్వహించిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంలో ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందజేశారు.

సంక్షిప్త వార్తలు

■ డీఎస్పీ తనిఖీ




ఆగిరిపల్లి: ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌ను శనివారం నూజివీడు డీఎస్పీ కిలాని వరప్రసాద్ తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, రికార్డులను పరిశీలించి నేరాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వరప్రసాద్ మాట్లాడుతూ పోలీసులు తమ విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, న్యాయం కోసం ఆశ్రయించే బాధితులకు అండగా నిలవాలని చెప్పారు. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ శుభశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

■ దసరా సెలవులకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

నూజివీడు: దసరా సెలవులను ప్రకటించడంతో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు శనివారం ఇంటి బాట పట్టారు. స్థానిక ట్రిపుల్ ఐటీలో నూజివీడు విద్యార్థులు 4,400 మంది, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి చెందిన 2,200 మంది విద్యార్థులు ఉన్నారు. ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు ఇవ్వడంతో వారంతా శనివారం మధ్యాహ్నం నుంచే ఇళ్లకు వెళ్తున్నారు. క్యాంపస్ నిర్మానుష్యంగా మారింది. విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లేందుకు ట్రిపుల్ ఐటీ అధికారులు నూజివీడు ఆర్టీసీ డిపో అధికారులతో మాట్లాడటంతో ట్రిపుల్ ఐటీ నుంచే 45 బస్సులను వివిధ ప్రాంతాలకు ఏర్పాటు చేశారు.

■ ఆలయ నిర్మాణానికి దాత విరాళం



తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలో నిర్మాణంలో ఉన్న దాసాంజనేయస్వామి ఆలయానికి ఓ దాత విరాళం అందజేశారు. తిరువూరుకు చెందిన పసుపులేటి శ్రీనివాసరావు, లలితకుమారి రూ. 25,116 విరాళాన్ని ఆలయ అర్చకులు ఎం. రామకృష్ణాచార్యులు, శ్రీనివాసాచార్యులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుడు శ్రీనాథ్‌లకు శనివారం అందజేశారు.

■ విజేతలకు బహుమతుల ప్రదానం

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర- 2047 కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మెండా దేవానందకుమార్ పర్యవేక్షించారు.

■ చలసాని జయప్రదకు నివాళి

నూజివీడు: సీపీఐ నాయకురాలు దివంగత చలసాని జయప్రద తృతీయ వర్ధంతి శనివారం పట్టణంలోని అమర్‌భవన్‌లో నిర్వహించారు. సీపీఐ సీనియర్ నాయకుడు కొమ్మన నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి అడుగులో పోరాటం ద్వారా బతకడం సాధ్యమని నిరూపించిన ధీర వనిత చలసాని జయప్రద అని అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, నాయకులు పాల్గొన్నారు.

■ బాధ్యతలు చేపట్టిన అధికారులు

నూజివీడు: డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారిగా జి. రంగారావు శనివారం నూజివీడు ఆర్డీఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. మచిలీపట్నం ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో నూజివీడు, ముసునూరు మండలాల్లో సర్వేయర్‌గా ఆయన పనిచేశారు.

■ ఈఓపీఆర్డీగా సత్యనారాయణ

ముసునూరు: వివిధ గ్రామాల పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజలకు సత్వర సేవలను అందిస్తానని ఈఓపీఆర్డీ సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వ బదిలీల్లో భాగంగా శనివారం ఆయన ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా బాధ్యతలను చేపట్టారు.

■ నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణంలోని విద్యుత్ ఉప కేంద్రాల్లో మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ ఎ. సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంప్లాయీస్ కాలనీ, అమ్మవారితోట, హనుమాన్ జంక్షన్ రోడ్డు, రామాయమ్మరావుపేట, కోనేరుపేట, చిన్నగాంధీబొమ్మ సెంటర్, కొప్పు వెలమపేట, పాతపేట, రైతుబజారు రోడ్డు, గాంధీనగర్, గొడుగువారిగూడెం, ఏరియా ఆస్పత్రి ప్రాంతం, స్టేషన్‌తోట, కుమ్మరిపేట, ధండంగార్డెన్, అజరయ్యపేటలలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

■ అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ముసునూరు: అదనపు కట్నం వేధింపులపై ముసునూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. హెడ్ కానిస్టేబుల్ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలవల్లికి చెందిన అనితకు, లింగపాలెం మండలం తువ్వచిలక రాయుడుపాలెంకు చెందిన దుబ్బాకు రాజేష్‌కు 2006లో వివాహమైంది. కొంతకాలంగా భర్త, కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారు. వేధింపులు తాళలేక అనిత శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

■ కబడ్డీలో సత్తాచాటిన హీల్ బాలికలు



ఆగిరిపల్లి: సీబీఎస్ఈ క్లస్టర్ సెవెన్ కబడ్డీ పోటీల్లో హీల్ పాఠశాలకు చెందిన బాలికలు సత్తా చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ సాయిబాబా తెలిపారు. ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లాలో జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్ సెవెన్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో హీల్ స్కూల్‌కి చెందిన బాలికలు వరుసగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ విజయం సాధించారన్నారు. ఈ సందర్భంగా హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, ఫెసిలిటీస్ డైరెక్టర్ భాస్కర్, ఎడ్యుకేషన్ కమిటీ సభ్యులు హరీష్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు నాగరాజు, దాసు, శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులను అభినందించారు.



నూజివీడు బస్టాండు వద్ద శివాలయంలో శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా అమ్మవారు




చనుబండ మెయిన్ రోడ్డులో అమ్మవారికి పూజలు



నూజివీడులో కోట మహిషమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



తిరువూరు కూరగాయల మార్కెట్లో అమ్మవారి అలంకారం




తిరువూరు కనకదుర్గాలయంలో గాయత్రీదేవి అలంకారం



మైలవరం పాండురంగస్వామి ఆలయంలో శాకంబరీ దేవిగా..



విస్సన్నపేట కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి అలంకరణ



కొణిజెర్లలో ప్రత్యేక పూజలు అందుకుంటున్న అమ్మవారు



గంపలగూడెం రామాలయం సెంటర్‌లో అమ్మవారి విగ్రహం



పెనుగొలను శివాలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం

నిత్యానందకరీ.. మాతాన్నపూర్ణేశ్వరి

తిరువూరు/మైలవరం/నూజివీడు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు శనివారం అమ్మవార్లు అన్నపూర్ణాదేవి, వివిధ అలంకరణలలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలు, గ్రామాల్లో ఏర్పాటుచేసిన పందిళ్లలో అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పాడిపంటలు, సిరిసంపదలు సంవృద్ధిగా ఇవ్వాలంటూ కోరుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు



బలివేలో గాయత్రీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



నెమలిలో రాజ్యలక్ష్మి అమ్మవారికి ధైర్యలక్ష్మి అలంకరణ



గుంటుపల్లి నాగేంద్రస్వామి ఆలయంలో అమ్మవారు

గుళ్లపూడి పేదల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ముసునూరు: గుళ్లపూడి పేదల సాగు, స్వాధీనంలో ఉన్న బంజరు భూములకు సాగు హక్కులు కల్పించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ డివిజన్ నేత వేముల బక్కయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు పామర్తి రామారావు ఆధ్వర్యంలో గుళ్లపూడి సచివాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ గుళ్లపూడికి చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ పేదలు మూడు తరాలుగా సాగు చేసుకుంటున్న భూముల లబ్ధిదారులతో జాయింట్ కలెక్టర్, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు ముఖాముఖి సమీక్ష ఏర్పాటు చేసి స్వయంగా పరిశీలించి, ఎంజాయ్‌మెంట్ సర్వే జరిపి, సాగుదారులను గుర్తించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుళ్లపూడి-కొణిజర్ల గ్రామాల మధ్య తమ్మిలేరుపై వంతెన నిర్మించాలని, గుడిపాడు జెడ్పీ హైస్కూల్లో టీచర్ పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేసి, గ్రామంలో సీసీ రహదారులు వేయాలనే డిమాండ్లతో వినతిపత్రాన్ని అందజేశారు. రాజేశ్వరి, ఏసు, సత్యనారాయణ, నారిపేళ్ల బుజ్జిబాబు, బసవలింగం, భలే రామయ్య, కొండయ్య, పేదలు, సాగుదారులు పాల్గొన్నారు.